# మిరియాల జున్ను



ఈ వేళ సెలవు కదా ! కాస్త ఇందూతో బుజ్జీతో పదో ఎక్కం వరకు మూడేసి సార్లు చెప్పించమని అమ్మ నాకు ఆర్డరేసింది. 'నిన్ను చెయ్యమని చెప్పిందే అమ్మా' - అని ఆ పని కాస్తా చిన్నారి కప్పు చెప్పాను. అది సందులో చాపమీద వాళ్లిద్దర్నీ కూచోబెట్టుకుని అరిపిస్తోంది. నాకు పెద్ద చదువుకోడానికంటూ ఏం లేదు గానీ నిన్నరాత్రి ఇండియా మాపుకి రంగులేసు కుంటుంటే మధ్యలో అమ్మ అన్నాలకి పిలవడంతో అంతా గందరగోళం అయిపోయింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం నీలం రంగులోనే వున్నాయి. కానీ పాపం హిందూ మహాసముద్రం ఆకుపచ్చగా వుంది. అసలే గుడ్డి లైట్లు. మధ్యలో అన్నాని కెళ్లడంతో పెన్సిళ్లు మారి పోయాయి. ఇప్పుడు మళ్లీ చచ్చినట్లు ఇంకో మాపు తీసుకుని సరిగ్గా రంగులేయాలి.

అసలు సముద్రాలకి రంగేయాలంటే ముందస్తుగా చిన్న తెల్ల కాయితం ముక్క మీద రంగుపెన్సిలుతో రంగెక్కించాలి. ఆ తర్వాత ఆ కాయితం ముక్క మేప్ మీదపెట్టి గట్టి గట్టిగా

రుద్దితే భలే అలలు అలలుగా సముద్రం వస్తుంది. ఈ వుపాయం నేను గుంటూర్లోనే నేర్చుకున్నాను. కానీ మాప్ డ్రాయింగ్ ఇప్పుడు కదా మాకు నేర్పుతున్నదీ !

వింధ్య పర్వతాలకి ముదురు ముక్కు పొడుం రంగు, దక్కను పీఠభూమికి బంతి పువ్వు రంగు వేసేశాను. ఇంక అడవులన్నిటికీ ఆకుపచ్చే కదా ! ఎంచక్కా సెలవు రోజుల్లో ఇలాటి చదువు పెట్టుకుంటే అమ్మా వాళ్లకీ మనం చదువుకుంటున్నట్లూ అనిపిస్తుంది. మనవేమో ఏవిటేవిటో ఆలోచించుకుంటూ హాయిగా రంగులు రంగులు దిద్దుకుంటూ కూచోవచ్చు. ఈ చదువు అవడమంటూ వుండదు కదా ! అలా పులుముతూ వుండడమేగా చెయ్యి నెప్పెట్టే దాకా !

మొన్న ఆస్పత్రికి జండాలవీ కట్టి పూజ చేసేశారు కదా ! అప్పుడు మద్రాసు నుంచి నాన్న కంపెనీ డైరెక్టర్లంతా వచ్చారని నాన్న వాళ్లకెన్ని మర్యాదలు చేయించారో ! అమ్మ రెండూ పూట్లా రకరకాల కారియర్లు పంపలేక చచ్చింది. అప్పుడు తెప్పిచ్చార్ట నాన్న పెద్ద పెద్ద పంచదార పలుకు లద్దిన అరిసెలంత బిస్కెట్లు. అవి కొన్ని మిగిలి పోయాయని ఆ బిస్కట్లు డబ్బా తెచ్చి ఇంట్లో పెట్టాడు చంద్రరావు పాపం ఎంతో మంచిగా. అయినా నాన్న వాడినే కేకలేశారు. ''మీ అందర్నీ తినేయమంటే ఇంటికెందుకు తెచ్చావు ? అక్కడ తినే వాళ్లెవరూ లేరా ?'' అని. మేం తినగా మిగిలినవే తెచ్చానయ్యా అన్నా వినిపించుకోరే. ఓ మూల నాన్న తిడుతుండగానే నేను డబ్బా లోపల పెట్టేశాననుకో !

''మన కంపెనీవేగా ! డైరెక్టర్లు తినగా లేంది మనం తినకూడదేవిటీ ఆపాటి బిస్కట్లూ'' అని అమ్మ కూడా ఇన్నాళ్టికి నామాటే మాట్లాడింది. ఆస్పత్రి పండగయిపోయాక నాన్న ఎక్కువగా ఇంట్లోనే వుంటున్నారు. ఆలస్యంగా వెళ్లడం పెందరాళే వచ్చేయడం ఇంకా గోపీగారని ఒకాయన చిన్న చిన్న పనులు మిగిలిపోతే చేయిస్తున్నార్ట. అందుకే కాబోలు పదయిపోతున్నా తీరుబాటుగా పడక్కుర్చీలో కూచుని పేపరు చదువుకుంటున్నారు. నాన్న ఆఫీసు కెళ్లేదాకా నేనా చుట్టుపక్కల పనులే పెట్టుకుంటా. అందుకే ఎక్కాల పని చిన్నారి కప్పచెప్పి నేను పక్కనే కూచుని డ్రాయింగు లేసుకుంటున్నా. మేపెలా వుంది నాన్నా అంటే తల తిప్పకుండానే చాలా బాగుందని చెప్పారు. మరి నేనే అలాటి పని చేస్తే తనకెలా వుంటుందీ ?

అమ్మయ్య ! ఇన్నాళ్టికి నా కోరిక తీరింది. మా నాన్న కోసం కూడా కాస్త మంచి బట్టలేసుకున్నాయన వచ్చారు. కాపోతే చేతిలో కాయితాల బదులు ఓ టిఫిను కారియరుంది. నేను మాత్రం తలెత్తకుండా రంగులేసుకుంటున్నా నాకెందుకొచ్చెలే అని. నాన్నే ముందు పలకరించారు - రా! రా! కృష్ణ స్వామీ ! ఆ చేతిలో కారియరేవిటి ? ఇంటికొచ్చేశావే! నేనే వచ్చేవాడినిగా కాసేపట్లో ఆఫీసుకి ! కూచో ! అని తను లేవకుండానే ఎదురు కుర్చీ లాగి ఓపాటి

మర్యాద చేశారు.

''ఏం లేదు సార్! మా ఇంట్లో గేదె ఈనింది. నిన్న రాత్రి. మా ఆడవాళ్లు జున్ను చేసారు. పిల్లల కోసం ఇచ్చి వెడదామని ఇటొచ్చా'' నని చెప్పాడు.

''వద్దు ! మా పిల్లలకి పడదు ! వాతమని చెప్పి మా ఆవిడ పిల్లలకి పెట్టదు. ఏం అనుకోవద్దు. తీసికెళ్లిపోండ'' ని నాన్న చెప్పేశారు.

అంత బోల్డు జున్ను నాన్న అలా వద్దనేటప్పటికి నాకు చాలా బాధనిపిచ్చింది. పాపం ఆయన అంత కష్టపడి వండించి తెస్తే మనం వద్దనచ్చా ? మనం అడిగి తింటే తప్పుగానీ ఎవరన్నా వాళ్లంతట వాళ్లు ఇస్తే వద్దన కూడదని వీళ్లేగా చెప్తారు మనకి. ఇంక వింటూ వూరుకోలేక పోయాను.

''మిరియాలు, ఏలకపొడి వేస్తే వాతం చెయ్యదు నాన్నా ! అమ్మ అప్పుడప్పుడు మాకు చేసి పెడుతుంది కదా !''

''నానీ ! నువ్వు లోపలికెళ్లి చదువుకో ! పెద్దవాళ్ల మాటల్లో మాట కలప కూడదని అమ్మ చెప్పిందా లేదా ?''

''మనమ్మాయి గారా ! ఏం చదువుతున్నా రండీ'' అనడిగాడు జున్నాయన.

''మా అమ్మాయే ! ఫస్టుఫారం చదువుతోంది''

''ఏంటీ నాన్నా ! ఎప్పుడూ ఓ క్లాసు తక్కువ చెప్తారు ? నా సెకండు ఫారం కూడా అయిపోవస్తుంటేనూ ! పైగా మాట కలపకూడదంటారు ?'' అన్నా, సర్లే లోపలికెళ్లి వేసుకో నీ డ్రాయింగులు అని నన్ను లోపలికి పంపేశారు. ఎంత కష్టపడి అక్కడ అన్ని మాపులూ అమర్చుకున్నానో ! చచ్చినట్లు లేచి అన్నీ తీసుకుని సందులో చిన్నారి వాళ్ల పక్కన కూచున్నా. నెత్తిమీదే కిటికీ. వాళ్లమాటలు వినిపిస్తూనే వున్నాయి.

''ఇంటికెందుకొచ్చారు ? అరగంటలో ఆఫీసు కొచ్చేవాడిని కదా? ఏవిటంత అర్జెంటు పని నాతో ?''

''కాద్సార్ ! బిల్లులో మూడు వేలు తగ్గించేశారు ! పనిలో ఎక్కడా తేడా రాలేదు. అందరూ రంగులు బావున్నాయని కూడా అన్నారు కదా !''

''ఏం బావున్నాయండీ ? మీరు చెప్పిన కంపెనీ రంగులు వాడారా ? అసలు గోపీ గారేం చేస్తున్నారు ? పనిలో తేడా రాబట్టే బిల్లు తగ్గించాను. మీకో వారం రోజుల్లో మద్రాసు నుంచి పేమెంటొస్తుంది'' నాన్న మాట విచిత్రంగా వినిపిస్తోంది.

మళ్లీ జున్నాయన గొంతు - ''మీరలా అంటే అన్యాయం అయిపోతాను, ఈ మూడొందలుంచండి. పిల్లలు గలవాడిని. గోపీ గారన్నీ చూసే సంతకం పెట్టారు కదా !''

ఇంక ఆయన గొంతు వినిపించటం మానేసి చెవులు గళ్లడేలా నాన్న అరుపులే !

''ఆ కారియరుచ్చుకుని తక్షణం వెళ్లిపోండి ! మేవూ పిల్లలు గలవాళ్లమే. కంపెనీ మా మీదుంచే నమ్మకమే మాకూ ఆధారం. లేపోతే మేవూ అడుక్కు తినాల్సొస్తుంది. ఇంకెప్పుడూ ఇలా రాకండి !'' అంతా నిశ్శబ్దంగా అయిపోయింది. ఆ వచ్చినాయన నోరెత్తకుండా వెళ్లి పోయాడల్లేవుంది. నాన్న కోపంగా ఇంట్లో కొచ్చి బట్టలేసుకుని ఆఫీసుకెళ్లిపోయారు. నాన్నెళ్లి పోయాక ఒక్కొక్కళ్లమే లోపలికొచ్చాం. అమ్మో ! అంత కోపం వస్తుందని మాకు అసలు తెలియనే తెలియదు సుమా !

అసలు అంత మంచి జున్ను వద్దనడానికి మనసెలా వచ్చిందో అమ్మనడిగా. ''ఏంటమ్మా మరీ అంత అన్యాయం ! జున్ను తింటే మూడొందలిస్తానన్నారు కదా ! ఎంత చెప్పినా వినకుండా పంపేశారు నాన్న ! మేం ఏ క్లాసు చదువుతున్నావో కూడా సరిగా తెలియదు గానీ జున్ను పడదని తెలుసేం ? నువ్వెన్నిసార్లు చేసిపెట్టలేదు ? ఒక్కసారన్నా వాతం చేసిందా గీతం చేసిందా ? అన్నీ అబద్ధాలు చెప్పారు''

''సుశీలా ఇప్పట్నించీ పెద్ద విషయాల్లో కల్పించుకోవద్దని మొన్నేగా నాన్న కేకలేసారు?''

''జున్ను తినడం కూడా పెద్ద విషయమా ?''

ఇలా కూచో ! అని నన్ను కూచోపెట్టింది. ''మన నాన్నకి జీతం, జీపూ అవీ ఎందు కిస్తున్నారు ? బాగా పనిచేయించి ఆస్పత్రి చక్కగా కట్టించమని కదా ! మరి ఈయన రంగులు సరి అయినవి వేయకుండా ఏదో మాయ చేశాడు ! అందుకని నాన్న ఇవ్వాల్సిందాంట్లో తగ్గించ మని మద్రాసు రాశారు. తగ్గించద్దూ ! మీకు ఇంకాసిని డబ్బులిస్తానూ ! అంటాడు. మరి మనం ఒప్పుకోవచ్చా?''

''తప్పుకదా ! పిచ్చి రంగులేశాడా ! నేనింకా జున్ను తింటే డబ్బు లెందుకిస్తానంటాడా అని ఆలోచిస్తున్నా ! అయినా ఎందుకమ్మా అంత గట్టిగా తిట్టడం ?''

''ఏమో మరి ! ఏం పాడు పని చేసాడో ! అవన్నీ నాన్నకి కదా తెలుస్తాయి ! మనకి ఏం చుట్టరికం వుందని అలా జున్ను వండించి తేవడం ! ఎంత తప్పు ! పై వాళ్లిచ్చేవి ఏవీ తీసుకో కూడదు. అందుకే నాన్న నిన్ను లోపలికెళ్లి పొమ్మన్నారు. చిన్న పిల్లవి నీకిప్పట్నించీ ఎలా తెలుస్తాయి?''

'చెప్తే మహా చక్కగా తెలుస్తాయి. చెప్పకపోతే ఎప్పటికీ తెలియవు. ఇప్పుడు నువ్వు చెప్తే తెలియలా ! అమ్మా మరి నాకిప్పటి కిప్పుడు జున్ను తినాలనుందే !''

''ఇప్పటికిప్పుడంటే ఎలా మరి ? రేప్పొద్దున్న బాలరాజుకి చెప్తాలే ఎక్కడన్నా జున్నుపాలు చూడమని. అదేవన్నా భాగ్యమా ! బంగారమా ! ఇదంతా మళ్లీ ఎవరితో చెప్పకేం బాగుండదూ!'' అని అమ్మ పనిలోకెళ్లిపోయింది.